

నిర్లక్ష్యపు నీడలో 'రాచర్ల కోట'

- మాయమవుతున్న చారిత్రక సంపద..

7



కోట చుట్టూ ఉన్న కందకం

శాంతిభద్రతలకు భంగం కలిగించొద్దు..

- ఎస్పీ అఖిల్ మహాజన్

8



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అధికారులు

సిరిసిల్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ తెలిపారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పోలీస్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించే గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, ప్రోటోకాల్ ప్రకారం అన్నిఏర్పాట్లు జరిగాయన్నారు.ఉదయం 9గంటలకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. పరిశీలనలో ఇన్‌చార్జి ఆర్డీవో రాధాబాయి, మున్సిపల్ కమిషనర్ లావణ్య, డీపీఆర్వో శ్రీధర్, తహసీల్దార్ ఉమారాణిలు ఉన్నారు.



బల్దియాల్లో ప్రత్యేక పాలన

- నేటితో ముగియనున్న పాలకవర్గాల గడువు
- రేపటి నుంచి అధికారుల పాలనకు సన్నాహాలు..

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

బల్దియాల్లో పాలకవర్గాల గడువు ఆదివారంతో ముగియనుంది. 27 నుంచి ప్రత్యేక పాలన ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభం అయ్యాయి. జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో ఇక నుంచి నిర్ణయాలన్నీ ప్రత్యేక అధికారులు తీసుకోనున్నారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో సిరిసిల్లలో 39 వార్డులు, వేములవాడలో 28 వార్డుల్లో పోటా పోటీగా సాగిన పోరులో పాలక పగ్గాలను రెండు చోట్ల బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. రెండు మున్సిపాలిటీల్లో 67 వార్డుల్లో ఐదు వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఏకగ్రీవం కాగా, 62 వార్డుల్లో 274 మంది పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పెద్దగా ప్రభావం చూపలేదు. బీఆర్ఎస్, రెబల్ అభ్యర్థుల మధ్యే పోటీ సాగింది. బీఆర్ఎస్ 38 సీట్లు, కాంగ్రెస్ మూడు సీట్లు, బీజేపీ 9 సీట్లు, స్వతంత్రులు 17 సీట్లు గెలుపొందడం గమనార్హం. సిరిసిల్ల, వేములవాడలో బీఆర్ఎస్‌కు చెందిన జిందం కళచక్రపాణి, రామతీర్థపు మాధవిలు చైర్ పర్సన్‌లుగా బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత అనేక రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిరిసిల్లలో కొంతమంది బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లారు. వేములవాడలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌కు వలసలు వెళ్లారు. బీఆర్ఎస్‌కు చెందిన వైస్ చైర్మన్ మధు రాజేందర్ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన కౌన్సిలర్ బింగి మహేష్ వైస్‌చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇలా పలు రాజకీయాల మధ్య బల్దియా పాలన గడువు ముగిసిపోయింది. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో మాజీ మంత్రి కేటీఆర్ ప్రత్యేక దృష్టితో అభివృద్ధి అశాజనకంగానే సాగింది. ప్రధాన రోడ్లతో పాటు జిల్లా కేంద్రానికి విద్యా సంస్థలు, కూడా వచ్చాయి. వేములవాడలో

మిగతా 8వ పేజీలో

విజయవంతంగా పాలన సాగించాం..

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి
- సిరిసిల్ల మున్సిపల్ సాధారణ సమావేశం

సిరిసిల్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ ఐదేండ్లు విజయవంతంగా పాలన కొనసాగించామని, అభివృద్ధి, ప్రజాసంక్షేమం లో ముందు వరుసలో నిలిపే దిశగా పనిచేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి అన్నారు. శనివారం సిరిసిల్ల మున్సిపల్ చివరి సాధారణ సమావేశం జరిగింది. 8 అంశాలతో కూడిన ఎజెండాను ఏకగ్రీవంగా అమోదించారు. పారిశుద్య నిర్వహణతో పాటు ఇతర కార్యక్రమాలకు సంబంధించిన నిధులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ సిరిసిల్ల అభివృద్ధికి మాజీ మంత్రి కేటీఆర్, పాలకవర్గ సభ్యులు, అధికారులు, సిబ్బంది వెన్నంటి ఉండి ముందుకు నడిపించారని అన్నారు. మమ్మల్ని అశీర్వ దించి పదవులు చేపట్టేలా చేసిన ప్రజలకు కృతజ్ఞ తలు తెలిపారు. పదవీకాలం ముగిసినా ప్రజల సమస్యలు తీర్చ డంలో తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ లావణ్య, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళచక్రపాణి

రాజన్నను దర్శించుకున్న కలెక్టర్



కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు ఘన స్వాగతం పలికారు. రాజన్న ఆలయ ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం అర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించి, రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. ఆయన వెంట ఆలయ సూపరిండెంట్ తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ సుభాష్ నగర్‌లో కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : యువత మహనీయుల అడుగుజాడలలో నడవాలని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని సుభాష్‌నగర్‌లో సుభాష్ జంక్షన్ సుందరీకరణ, ఆదర్శ అంబేద్కర్ సంఘ కమ్యూనిటీ హాల్ భవనాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవితో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస మాట్లాడుతూ మహనీయులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. పట్టణ సుందరీకరణలో భాగంగా అంబేద్కర్ చౌరస్తాను సుందరీకరిస్తున్నామని,అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నా మన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో రూ.4లక్షలతో అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. కమ్యూనిటీ భవనాలను ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికలుగా ఉపయోగించుకోవాలని అన్నారు. వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఏఈ నరసింహస్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ఆదర్శ అంబేద్కర్ మాల సంఘం అధ్యక్షుడు గుండం బాలయ్య, నాయకులు రాపల్లి శ్రీధర్, సాగరం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

నాటి పోరాటాలు.. నేటి తరానికి జ్ఞాపకాలు

- గణతంత్ర చరిత్రలో సిరిసిల్ల..
- ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చిన ఆంధ్ర మహాసభ
- మానాల కేంద్రంగా గెరిల్లా శిబిరాలు
- సిరిసిల్లలో చేనేత కార్మిక మహాసభ

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

చరిత్ర గర్వించే నాటి పోరాటాలు నేటి యువతకు స్ఫూర్తి జ్ఞాపకాలుగా నిలిచాయి. జాతీయ పోరాటాల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు ఘనమైన చరిత్ర ఉంది. జిల్లా వ్యాప్తంగా నిప్పు కణికల్లా ఉవ్వెత్తున ఎగిసి బ్రిటీష్, నిజాం పాలకులకు ఎదురొడ్డి ధీరత్వాన్ని చాటిన వారున్నారు. ఆనాటి పోరాటాలకు సంబంధించిన ఎన్నో ప్రదేశాలు ఇప్పుడు జ్ఞాపకాలుగా యువత సంకల్పాన్ని గుర్తుచేస్తున్నాయి. ఉద్యమాల్లో జిల్లా ప్రజలు పోషించిన పాత్రను జనవరి 26 గణతంత్ర దినోత్సవం రోజు గుర్తు చేసుకుంటున్నారు. ముఖ్యంగా స్వాతంత్ర్య పోరాటాల్లో స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహాలు, సిరిసిల్లలో చేనేత కార్మిక మహాసభలు, సిరిసిల్ల పాత తాలూకాలోని మానాల అడవుల్లో గెరిల్లా శిబిరాలు, ఖాదీ ఉద్యమం, గ్రంథాలయోద్యమం, ఆంధ్ర మహాసభ, ఆంధ్ర మహిళా మహాసభలు నిర్వహిస్తూ జిల్లా ప్రజలు కదంతొక్కారు. పోరాటాలకు సిరిసిల్లలో జరిగిన ఆంధ్ర మహాసభ ఉమ్మడి జిల్లాకు స్ఫూర్తినిచ్చింది. నిజాం సంస్థానంలో భాష సంస్కృతులు అణచి వేయబడుతున్న కాలంలో ఆంధ్రజన కేంద్ర సంఘం 1928లో ఆంధ్రా మహాసభగా రూపుదాల్చింది. 1935లో నాలుగో ఆంధ్రమహాసభ సిరిసిల్లలో భీమకవి నగరంగా మాడపాటి హన్మంతరావు అధ్యక్షతన సభ జరిగింది. మహాసభ నిర్వహణలో



మానాల అడవుల్లో గెరిల్లా శిబిరం(ఫైల్)

సిరిసిల్ల తాలూకాలోని గాలిపెల్లికి చెందిన బద్దం ఎల్లారెడ్డి ముఖ్య భూమికను పోషించాడు. ఇదే ప్రాంగణంలో 4వ ఆంధ్ర మహిళ సభ కూడా నిర్వహించారు. ఈ మహాసభల స్ఫూర్తితో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు కొత్త మలుపు తిరిగాయి.

సిరిసిల్లలో చేనేత కార్మిక సభ..

ఆంధ్ర మహాసభ స్ఫూర్తితో సిరిసిల్ల నేత కార్మికులు కూడా ముందుకు సాగారు. చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించడం కోసం చేనేత కార్మిక సంఘం ఏర్పడింది. కార్మిక సంఘం తెలంగాణ తృతీయ మహాసభను సిరిసిల్లలో జరుపుకున్నారు. సిరిసిల్ల ఖాదీ ఉద్యమంలోనూ ముందు వరసలో నిలిచింది. 1946లో నిజాం నిరంకుశ వ్యతిరేక పోరాటం ఉధృతంగా సాగింది. ఖాదీ కార్యకర్తలపై నిర్బంధాలు విధించారు. స్వాతంత్ర పోరాటంలో ఉన్న ఉద్యమకారులపై నిర్బంధాలు ఉండడంతో చరఖా సంఘాల్లో తలదాచుకునే వారు. స్వాతంత్ర్యం సాధించిన తరువాత నిజాంకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం ఉధృతంగా సాగిన క్రమంలో నాడు సిరిసిల్ల పాత తాలూక, ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న మానాల అడవి గెరిల్లా శిక్షణ శిబిరాలకు కేంద్రంగా మారింది. సిరిసిల్ల, రుద్రంగి, కామారెడ్డి, అర్మూర్, ప్రాంతాలకు చెందిన కార్యకర్తలు మానాలలో శిక్షణ పొందేవారు. మానాల గ్రామ భూస్వామి రాజిరెడ్డి శిక్షణ శిబిరాలకు ఎంతో సహకరించేవాడు.

గ్రంథాలయోద్యమం..

నిజాం నిరంకుశ పాలన కింద బతుకులీడుస్తున్న ప్రజలను పోరాట బాటలో నడిపించడానికి గ్రంథాలయోద్యమం కూడా ముఖ్యమైంది. అక్షర జ్ఞానం నేర్పి పత్రికా పఠనం ద్వారా ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు. 1925లో సిరిసిల్లలో శ్రీనారాయాంధ్ర భాషా నిలయం స్థాపించారు. స్వాతంత్ర్య పోరాటం కోసం ప్రజలు ఆలపించడానికి జాతీయ గీతంగా వందేమాతరం ఉండేది. వందేమాతరం గీతాలాపనతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా విద్యార్థుల్లో దేశభక్తి మొదలైంది. అదే స్ఫూర్తితో క్విట్ ఇండియా ఉద్యమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా హన్మజి పేటకు చెందిన జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి నారాయణరెడ్డి నడిపించారు.

గణతంత్ర వేడుకలు ఇలా...

జిల్లాకేంద్రంలోని బైపాస్ రోడ్డులో పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లుచేశారు. ఆదివారం పరేడ్‌గ్రౌండ్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఉదయం 9గంటల నుంచి 9.05 నిముషాల వరకు జాతీయ పతాకావిష్కరణ, 9.05 నుంచి 9.15వరకు గౌరవ వందనం స్వీకరణ, 9.10 నుంచి 9.20 వరకు కలెక్టర్ సందేశం, 9.20 నుంచి 9.50వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, 9.50 నుంచి 10.30 గంటల వరకు ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు ప్రదానం చేయనున్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా - కలెక్టరేట్‌లో ఉద్యోగులు, సిబ్బంది ప్రతిజ్ఞ
- ఘనంగా ఓటరు దినోత్సవం.. అవగాహన ర్యాలీలు..



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కును వినియోగించుకోవడం అందరి బాధ్యతగా ఉండాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. శనివారం 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా ఉత్సాహంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఉద్యోగులు, సిబ్బందితో ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఓటరు దినోత్సవం సందర్భంగా వివిధ సంస్థల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు చైతన్య, నిఖిత, హారిక, రోహిత్, సాయికృష్ణ, రాంచరణ్, ప్రేమ్‌కుమార్‌లకు బహుమతులు అందించారు. నూతన ఓటర్లకు ఎపిక్ కార్డులను అందించారు. సీనియర్ సిటిజన్లు, ఓటర్లు, ట్రాన్స్‌జెండర్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఓటరు నమోదు పెంపు ఎథికల్ ఓటింగ్, అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం జాతీయ ఓటరు దినోత్సవం నిర్వస్తున్నామని అన్నారు. ఈ సంవత్సరం నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓటింగ్ ఫర్ ష్యూర్ అనే థీమ్‌తో వేడుకలు జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జడ్పీ సీఈవో వినోద్, సిరిసిల్ల ఇన్‌చార్జి ఆర్డీవో రాధాబాయి, తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో అవగాహన ర్యాలీ..

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీచౌక్ మీదుగా ర్యాలీ నిర్వహించి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీవో రాధాబాయి, తహసీల్దార్ ఉమారాణి, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

● గొల్లపల్లి యువకుడి దుర్మరణం



గంగరాజు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికిచెందిన యువకుడు మ్యాకల గంగరాజు(26) హైదరాబాద్‌లో ఈనెల24న రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందాడని కుటుంబసభ్యులు, స్థానికులు శనివారంతెలిపారు. గ్రామంలోని మ్యాకల మల్లవ్వ-దేవయ్య దంపతుల ఒక్కడే కొడుకైన గంగరాజు నాలుగేళ్లుగా హైదరాబాద్‌లో బైక్‌మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల24న రాత్రి పనులు ముగించుకుని గదికి వెళ్తున్న క్రమంలో వాహనం ఢీకొట్టింది. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు వెళ్లిపోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని శనివారం స్వగ్రామానికి తరలించారు. మృతుడికి తల్లిదండ్రులు మల్లవ్వ, దేవయ్య, వివాహమైన ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. కాగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

చికిత్సపొందుతూ మృతి

ఇల్లంతకుంట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్జీపూర్ గ్రామానికిచెందిన అట్ల నాగభూషణం(48) చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. గ్రామస్థులుతెలిపిన వివరాలప్రకారం.. నాలుగు రోజుల క్రితం ఇల్లంతకుంట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగభూషణం తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని మొదట సిద్దిపేటకు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు.

గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

గంభీరావుపేట జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నాగంపేట కమాన్ వద్ద గంజాయి అమ్ముతున్న వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. నాగంపేట కమాన్ వద్ద ఒక వ్యక్తి బస్సులో వచ్చి అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించగా, అతనివద్ద 110గ్రాముల గంజాయి లభ్యమైందని తెలిపారు. అతన్ని విచారించగా కరీంనగర్‌జిల్లా గంగాధర మండలం ముప్పిడిపల్లి గ్రామానికి చెందిన కల్లపల్లి శ్రీనివాస్‌గా తేలిందన్నారు. నెలరోజుల క్రితం మహారాష్ట్రలోని బల్లార్షాకు చెందిన గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి అందులో కొంచెం తాగి మిగిలినది అధిక ధరకు అమ్మడానికి వచ్చినట్లు నిందితుడు తెలిపాడని ఎస్‌ఐ పేర్కొన్నారు. గంజాయిని సీజ్ చేసి నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్టు పేర్కొన్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడిపై కేసు

బీర్‌పూర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న యువకుడిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామి తెలిపారు. మంచిర్యాలజిల్లా జన్నారం మండలం కలమడుగు (పోచమ్మగూడెం)కు చెందిన పరచ సురేందర్(26) అనే యువకుడు శనివారం బీర్‌పూర్ మండలంలోని మంగేళ ఎక్స్‌రోడ్డు వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీచేయగా 500గ్రాముల గంజాయి పట్టుబడిందన్నారు. గంజాయిని సీజ్ చేసి సురేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్టార్టర్ ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు

శంకరపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలం కన్నాపూర్ గ్రామంలోని వ్యవసాయబావి వద్ద కరెంటు మోటర్ స్టార్టర్ ఉండే బాక్స్ తాళం పగలగొట్టి స్టార్టర్, ఆటోమెటిక్ స్టార్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని రైతు కంతాల విష్ణు శనివారం తెలిపారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

కాలుష్యపు కోరల్లో రామగుండం



గోదావరిఖని, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజలపై మరో పిడుగు పడనున్నది. సింగరేణి గనులు, ఓసీపీలు, ఎన్టీపీసీ, పలు పరిశ్రమలతో రామగుండం కాలుష్యపు కోరల్లో చిక్కుకుంటోంది. ఈ క్రమంలో 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంను రామగుండం ఎన్‌టీపీసీలో ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. 800/5 4000 మెగావాట్ల ఐదు సూపర్ థర్మల్ యూనిట్ల ఏర్పాటుకు ఎన్‌టీపీసీ సిద్ధమైంది. ఇందులో 800/2 1600 మెగావాట్ల విద్యుత్ కేంద్రాలు

● **ఉపాధి, ఉద్యోగాలు**

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఎన్‌టీపీసీ విడుదల చేసిన నివేదికలో 800/3 మెగావాట్ల విద్యుత్ కేంద్రాల ఏర్పాటు ద్వారా 96శాశ్వత ఉద్యోగాలు, 216 కాంట్రాక్టు ఉద్యోగాలు లభిస్తాయని ప్రకటించింది. అయితే ప్లాంట్ల నిర్మాణ సందర్భంలో మాత్రం రెండేళ్ల పాటు 3వేల మందికి ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొంది. భారీ విద్యుత్ ప్లాంట్‌లో ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి, ఉద్యోగాల ప్రయోజనాలు కూడా కలుగడం లేదు.

ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మరో 800/3 యూనిట్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.29,345 కోట్లు మంజూరు చేసింది. ఈ యూనిట్ల నిర్మాణ అనుమతుల నేపథ్యంలో పర్యావరణ అనుమతి కోసం ప్రజాభిప్రాయాన్ని ఈ నెల 28న ఎన్‌టీపీసీ జెడ్‌పీ స్కూల్‌లో ఏర్పాటు చేశారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కలెక్టర్ సమక్షంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుగనున్నది. ఈ మూడు యూనిట్లు ప్రారంభమైతే ఈ ప్రాంతం లో వాతావరణ కాలుష్యం పెరిగి మనుగడనే ప్రశ్నార్థకం చేసే స్థాయికి చేరుకుంటోందని ఆందోళన చెందుతున్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరగ కుండా ఈ ప్రాంతంపై జరుగుతున్న పారిశ్రామిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నారు.

● **రోజూ లక్ష టన్నుల బొగ్గుమండుతున్నది...**

ఎన్‌టీపీసీలో పాత 2400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి రోజూ 40వేల టన్నుల బొగ్గు మండిస్తున్నారు. తెలంగాణ సూపర్‌థర్మల్ మొత్తం 4000మెగావాట్ల సామర్థ్యానికి రోజూ 60వేల టన్నుల బొగ్గును మండించాల్సి ఉంటుంది. అంటే రోజూ లక్ష టన్నుల బొగ్గు ఇక్కడ మండుతుంది. ఒక టన్ను బొగ్గును మండించడం వల్ల ప్యాటుకులేట్ మ్యాటర్(అతి సూక్ష్మ దుమ్ము, ధూళికణాలు) మూడు కిలోలు వెలువడుతాయి. గాలిలో చేరడం వల్ల ఆక్సిజన్ బరువుతో వెయ్యి కిలోలు దాటి దుమ్ము, ధూళి కణాలు వాతావరణంలోకి వస్తాయి. ఇదే టన్ను బొగ్గు కాల్చడం వల్ల కార్బన్ డై ఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ వాతావరణంలో కలిసిపోతాయి. ఇవి ఈ ప్రాంత భూతాపాన్ని పెంచడంతో పాటు దీర్ఘకాలిక వాతావరణ ప్రతికూల పరిస్థితులను పెంపొందిస్తాయి. ఒక టన్ను బొగ్గు మండించడంతో సల్ఫర్ ఆక్సైడ్ కూడా 4కిలోలు వెలువడుతుంది. దీని వల్ల ఊపిరితిత్తుల వ్యాధులకు కారణమవుతోంది. ఎన్‌టీపీసీ చెబుతున్న లెక్కల ప్రకారమే బొగ్గు మండించడం వల్ల బొగ్గు నాణ్యతను బట్టి 40శాతం వరకు బూడిద బయటకు వస్తుంది. టన్ను బొగ్గుకు 400 కిలోల బూడిద బయటకు వస్తుంది. యేటా 36.5 మిలిటన్నుల బొగ్గును విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తే వాతావరణ కాలుష్యం దెబ్బతినే అవకాశం ఉంది.

● **డబ్ల్యూహెచ్‌ఓ చెబుతున్నది ఏమిటి...**

ప్రపంచ ఆరోగ్య సంస్థ గాలిలో 15మైక్రో గ్రాముల ఏక్యూఐ ఉండాలని చెబుతున్నది. పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి 50మైక్రో గ్రాములు ఉండవచ్చు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఇప్పటికే 110 మైక్రో గ్రాముల ఏక్యూఐ ఉందని, ఇది 200, 360వరకు చేరుతున్నదని చెబుతున్నారు. ఈ కారణంగా క్యాన్సర్, గుండెపోట్లు వస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు.

● **ఒక్క ఎన్‌టీపీసీకే యేటా 5టీఎంసీల నీరు...**

ఎన్‌టీపీసీ పాత యూనిట్లు, తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు 4000మెగావాట్ల సామర్థ్యం కలిసి సంవత్సరానికి 5టీఎంసీల నీటిని వినియోగిస్తున్నది. నీటిని అతి ఉష్ణోగ్రత స్థాయిలో ఉడికించడం వల్లనే విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. ఇప్పటికే 250 క్యూసెక్కుల నీటి సామర్థ్యం గల రిజర్వాయర్‌ను ఎన్‌టీపీసీ ఏర్పాటు చేసుకుంది. శ్రీపాద ప్రాజెక్టు నుంచి రూ.180కోట్లు పెట్టుబడితో నీటి వాటాను తీసుకుని తెలంగాణ ప్రాంత వ్యవసాయ రంగ నీటి అవసరాలపై కూడా ఎన్‌టీపీసీ ప్రభావం చూపుతున్నది.

● **పీపీఏపై అనుమానాలు...**

కొత్తగా 2400మెగావాట్ల మూడు యూనిట్లపై పవర్ పర్చేజ్ అగ్రిమెంట్(పీపీఏ)పై స్పష్టత రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త యూనిట్ల కేవలం 800మెగావాట్లు మాత్రమే రాష్ట్ర విద్యుత్ అవసరాలకు తీసుకుంటామని కేంద్రానికి లేఖ రాసినట్లు తెలిసింది. ఎన్‌టీపీసీ వెయ్యి మెగావాట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, 600మెగావాట్లు కేంద్ర ప్రభుత్వ సూచనలతో అమ్మేందుకు సమాలోచిస్తున్నట్లు సమాచారం.

● **ఎన్‌టీపీసీ వద్ద 11వేల ఎకరాలు...**

రామగుండం ఎన్‌టీపీసీ నిర్మాణంతో ఈ ప్రాంతంలోని తొమ్మిది పల్లెలు కాంక్రీటు వనంలా తయారయ్యాయి. ఎన్‌టీపీసీ నిర్మాణం కోసం 10,800 ఎకరాలను భూసేకరణ చేసింది. దీంతో మేడిపల్లి, రాణాపూర్, ఎల్కలపల్లి, లక్ష్మీపురం, శాలపల్లి, పొరట్‌పల్లి, మల్యాల పల్లి, రాజాపరం, కుందనపల్లి ఊర్లు ప్రభావితమ య్యాయి. ఈ గ్రామాల్లోని చెరువులు, కుంటలు, పశుసంపద, భూగర్భ జల సంపద దెబ్బతిన్నది.

● **ఒకే చోట 8వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి...**

రామగుండం పారిశ్రామిక ప్రాంతం కేంద్రంగానే 8000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగడం పారిశ్రామిక అభివృద్ధి పరంగా గొప్ప విషయమే అయినా మానవ మనుగడను ప్రశ్నార్థకం చేసే వాతావరణ కాలుష్యం ఆందోళన కలిగిస్తున్నది. ఇప్పటికే ఎన్‌టీపీసీలో 500/4, 200/3 మొత్తం 2600మెగావాట్లను ఎన్‌టీపీసీ ఉత్పత్తి చేస్తోంది. తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు కింద 800/2 ఉత్పత్తి జరుగుతుంది. సింగరేణి జైపూర్ ప్లాంట్ 600/2 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. ఇప్పుడు ఎన్‌టీపీసీలో మరో 800/3మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి పర్యావరణ అనుమతులు జరుగుతున్నాయి. సింగరేణి, ఎన్‌టీపీసీ సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నది. పైగా జైపూర్‌లో 800/1, జెన్‌కో ద్వారా రామగుండంలో 800/1 థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు జరుగుతున్నది.

'బ్రాహ్మణ పరిషత్ విదేశీ విద్యానిధి పథకం రుణాలు విడుదల చేయాలి'

కరీంనగర్ కల్చరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంక్షేమపరిషత్‌కు మంజూరైన 40కోట్ల నుంచి విదేశీ విద్యానిధి పథకానికి నిధులు విడుదల చేయాలని భారతీయ బ్రాహ్మణఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శ్రీరాంభట్ల దీపక్‌బాబు ఒకప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. మూడు సంవత్సరాలుగా బ్రాహ్మణ సంక్షేమపరిషత్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రుణాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే రుణాలు మంజూరుచేస్తే లబ్ధిదారులు ఆయా యూనిట్లను ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందే అవకాశం ఉందని తెలిపారు. సకాలంలో రుణాలు మంజూరు కాకపోవడంతో విదేశాల్లో ఉన్న విద్యార్థులు, పేద బ్రాహ్మణులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను బ్రాహ్మణ కార్పొరేషన్‌గా మార్చాలని కోరారు.

ఐక్యతా రాగం.. ఆపైన విమర్శలు

● స్మార్ట్‌సిటీ ఘనత తమదేనని చెప్పుకున్న నేతలు
● ఆసక్తికరంగా ప్రజాప్రతినిధుల వ్యాఖ్యలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

'నాకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో భేదాభిప్రాయాలు లేవు.... అందరం కలిసి కరీంనగర్ అభివృద్ధికి కృషిచేస్తాం.. జెండాలు, ఎజెండాలు, పార్టీలను పక్కన బెట్టి కరీంనగర్ అభివృద్ధికి పాటుపడతాం' అంటూ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఐక్యతారాగాన్ని ఆలపించడం జిల్లారాజకీయాల్లో ఆసక్తికర చర్చకు తెరతీసింది. బండి సంజయ్‌కుమార్ ప్రసంగించిన వేదికపైనేవచ్చిన స్మార్ట్‌సిటీ ప్రస్తావన నేతల అంతరంగాలను ఆవిష్కరించింది.

స్మార్ట్‌సిటీకి నిధులు తీసుకువచ్చి, కరీంనగర్‌ను అభివృద్ధి చేసింది కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమారేఅని మేయర్ యాదగిరిసునీల్‌రావు అన్నారు. ఆ క్రెడిట్‌ను ఆయనఖాతాలో వేయడానికి అంగీకరించని రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్ స్మార్ట్‌సిటీకి మాజీ ఎంపీ బోయినపల్లివినోద్‌కుమార్ చేసిన కృషితోపాటు తాను ఎంపీగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి కూడా కారణమని అన్నారు.

మాజీమంత్రి, ఎమ్మెల్యే గంగులకమలాకర్ మాట్లాడుతూ ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఎంపీ వినోద్ కుమార్‌తోకలిసి తాను ఢిల్లీవెళ్లి స్మార్ట్‌సిటీ జాబితాలో కరీంనగర్‌ను చేర్పించేందుకు చేసిన ప్రయత్నం ఫలించిందని స్మార్ట్‌సిటీని తమఅకౌంట్‌లో వేసుకున్నారు.

అటుబీజేపీ, ఇటుకాంగ్రెస్, బీఆర్‌ఎస్‌నేతలు ఎవరికివారు స్మార్ట్‌సిటీని తేవడం తమ ఘనతేనని చెప్పుకోవడంతో స్మార్ట్‌సిటీ పనుల్లో జరిగిన అక్రమాల మాటేమిటనే చర్చ జోరుగా సాగుతున్నది. బీఆర్‌ఎస్ మేయర్‌గా సునీల్‌రావు, ఎమ్మెల్యేగా, మంత్రిగా గంగుల కమలాకర్, ఎంపీగా బండి సంజయ్‌కుమార్ ఉన్న సమయంలో స్మార్ట్‌సిటీ పనులు జరిగాయి. ఈ పనుల్లో అక్రమాలు జరిగాయని, వాటిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేసిన విషయాన్ని నగర ప్రజలు గుర్తుచేసుకొని చర్చించుకుంటున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్‌సిటీ, పట్టణ ప్రగతి నిధులతో చేపట్టిన పనులతోపాటు మానేరు రివర్‌ఫ్రంట్‌పనుల్లో అక్రమాలు జరిగాయని విచారణ చేపిస్తామని రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆరోపణలు, ప్రత్యారోపణలు అలా ఉండగానే మేయర్ సునీల్‌రావు బీజేపీలో చేరాయి. మామధ్య ఎలాంటి విభేధాలులేవు కలిసి పనిచేస్తామంటూ కేంద్రమంత్రి పేర్కొనడంతో స్మార్ట్‌సిటీ అవినీతిఅంశం అటకెక్కినట్టేనా అని అనుకుంటున్నారు.

మెట్‌పల్లి సీఐకి ఇండియన్ పోలీస్‌మెడల్



సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యున్నత సేవలు అందించే ప్రభుత్వ అధికారులకు కేంద్ర ప్రభుత్వం అందించే ఇండియన్ పోలీస్ మెడల్‌కు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి ఎంపికయ్యారు. పోలీస్‌శాఖలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డికి హైదరాబాద్‌లో జరిగే గణతంత్ర వేడుకల్లో ఇండియన్ పోలీస్‌మెడల్‌ను ప్రకటించనున్నారు. ఈ సందర్భంగా సీఐ నిరంజన్‌రెడ్డికి జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కేకేనగర్‌లో కార్డన్ సెర్చ్

ఫైటింక్లయిన్‌కాలనీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి వెంకట్రావ్‌పల్లె పంచాయతీ కేకేనగర్‌లో శనివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారు జామున పోలీస్ బృందాలు ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలు లేని ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామస్థులను ఉద్దేశించి సీఐ ప్రసాదరావు మాట్లాడారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాహన దారులు అన్ని రకాల ధృవీకరణ పత్రాలు కల్గి ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీఐ-2 లింగమూర్తి, ఎస్సైలు ప్రసాద్, రవళి, సిబ్బంది కలీల్, కృష్ణారెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాల వద్ద యజమానులతో మాట్లాడుతున్న సీఐ

వివాహిత ఆత్మహత్యాయత్నం

ఫైటింక్లయిన్‌కాలనీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి రాజీవ్‌నగర్‌తండాకు చెందిన తేకల సౌజన్య అత్తింటి వేధింపులు భరించలేక ఇంట్లో ఉన్న మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. అస్వస్థతకుగురైన సౌజన్యను కుటుంబసభ్యులు గోదావరి ఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. ఆత్మహ త్యాయత్నానికి ముందు సెల్ఫీ వీడియో తీసింది. సౌజన్య భర్త అనురాగ్ ఏడాదిక్రితం గుండెపోటుతో మరణించాడు. తండ్రిఉద్యోగం వచ్చే క్రమంలోనే అనురాగ్ మృతిచెందాడు. తమకు రావాల్సినఉద్యోగం అత్త మామలు కుమార్తెకు ఇప్పించుకుని తనకు అన్యాయం చేశారని, ఎటువంటి ఆధారంలేని తనను నిత్యంసూటి పోటిమాటలతో వేధించడంతో జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్యకు పాల్పడుతు న్నట్లు సౌజన్య వీడియోలో పేర్కొన్నది.

విద్యార్థినికి పలువురి సన్మానం

గన్నేరువరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇంగ్లీష్ టీచర్స్ అసోసియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఇంగ్లీష్ ఉపన్యాసపోటీలో మండల కేంద్రంలోని జడ్పీఉన్నత పాఠశాలకుచెందిన విద్యార్థిని పత్తి వైశాలి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. దీంతో పలువురు నాయకులు శనివారం విద్యార్థినిని, ఉపాధ్యాయబృందాన్ని సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో రామయ్య, నాయకులు పుల్లెలజగన్, వేణుగోపాల్, కాంతాల అంజిరెడ్డి, సందవేణి ప్రశాంత్, రేపాకబాబు, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



సంపత్(ఫైల్)

తిమ్మాపూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో రాజీవ్‌రహదారిపై లారీఢీకొని ఒకరు మృతి చెందారు. ఎల్‌ఎండీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ మండలంలోని పర్లపల్లి గ్రామానికి చెందిన గట్టు సంపత్(24) అలుగునూరులోని రైస్ మిల్లులో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అతడి తల్లిదండ్రులు గతంలోనే చనిపోయారు. పర్లపెల్లిలో తన అన్నతో కలిసి ఉంటున్నాడు. శనివారం గట్టు సంపత్ కొత్తపల్లి శివారులో కరీంనగర్ వైపు వస్తూ రోడ్డుకు పక్కన తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి డివైడర్ పైనుంచి రోడ్డు దాటుతున్నాడు. ఈక్రమంలో కరీంనగర్ వైపు నుంచి హైదరాబాద్ వైపు బూడిదలోడుతో వెళుతున్న లారీ సంపత్‌ను ఢీకొంది. దీంతో సంపత్ లారీ టైర్ కింద పడగా తీవ్రగాయాలై సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో దాడి.. ఇద్దరికి గాయాలు

మల్యాల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఇరు కుటుంబాల మధ్య జరిగిన గొడవలో బావమరుదులపై బావ కత్తితో దాడి చేయడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన గుండోజి చంద్రశేఖర్‌తో జగిత్యాలకు చెందిన అనసూరి నవ్య వివాహం 2021లో జరిగింది. ఏడాది తరువాత కుటుంబ కలహాలతో జగిత్యాల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వరకట్న వేధింపుల కేసు నమోదైంది. ఇరు కుటుంబాల మధ్య ఆదివారం పంచాయితీ ఉంది. ఈ నేపథ్యంలో శనివారం నవ్యతో పాటు ఆమెతండ్రి, సోదరులు ముత్యంపేటకు వచ్చారు. ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి దాడులకు దారి తీసింది. ఈ క్రమంలో చంద్రశేఖర్ తన బామ్మర్దులు శివసాయి, నవీన్‌కుమార్‌పై కత్తితో దాడి చేయడంతో గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని 108లో చికిత్సకోసం ఆసుపత్రికి తరలించారు.

బాధితుల ఫిర్యాదుతో ఎస్సై నరేశ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ..

● 35తులాల బంగారం, 80తులాల వెండి, రూ.3.50లక్షల నగదు దొంగతనం
● రంగంలోకి దిగిన రెండు పోలీసు టీంలు
● సంఘటనా స్థలాన్ని పరిశీలించిన టౌన్ ఏసీపీ

కరీంనగర్ క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని అశోక్‌నగర్‌లో తాళంవేసిన ఇంటిలో శనివారం గుర్తు తెలియని దొంగలు చొరబడి భారీగా బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించుకుపోయారు. కరీంనగర్ ఒకటోఠాణా సీఐ బిల్లకోటేశ్వర్, బాధితులు కథనం ప్రకారం.. సహకారశాఖలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా ఉద్యోగం చేసి పదవీవిరమణ పొందిన మురుగం అంజని అశోక్‌నగర్‌లో నివాసం ఉంటోంది. ఆమెకు ఇద్దరుకూతుళ్లు ఉన్నారు. మురుగం అంజని ఇంటికి తాళంవేసి తన సోదరుడితో కలిసి శనివారం ఉదయం వరంగల్‌కు వెళ్లింది. పనిముగించుకుని సాయంత్రం తిరిగి కరీంనగర్‌కు వచ్చింది. ఇంటికి వెళ్లి చూసేసరికి ఇంటి వేసిన తాళం వేరేది ఉంది. పక్కనే ఉంటున్న ఆమె తల్లిని అడగగా తలుపులు తెరచి ఉండటంతో తానే తనవద్ద తాళం వేశానని తెలిపింది. దీంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరచి ఉంది. బీరువాలో భద్రపరిచిన 35తులాల బంగారు ఆభరణాలు, 80తులాల వెండి ఆభరణాలు, రూ.3 లక్షల 50వేలనగదు కనపడలేదు. ఇంటిలో మరోచోట భద్రపరిచిన మరికొంత బంగారం మాత్రం భద్రంగానే ఉంది. గుర్తుతెలియని దొంగలు తాళం పగులగొట్టి ఇంటిలోకి చొరబడి బీరువాలోని బంగారం, వెండి, నగదు దొంగిలించు కుపోయారని బాధితురాలు కరీంనగర్ ఒకటోఠాణాలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని టౌన్ ఏసీపీ వెంకటస్వామి పరిశీలించారు. క్లూస్ టీంతో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. చోరీజరిగిన ఇంటి సమీపంలోని పలు సీసీకెమెరాలను పోలీసు టీంలు తనిఖీ చేస్తున్నాయి. నిందితులను పట్టుకునేందుకు రెండు పోలీసు టీంలు రంగంలోకి దిగి పలువురు అనుమానితులను విచారిస్తున్నారు. పగటిపూటనే భారీ దొంగతనం జరగడంతో తెలిసినవారే ఈచోరీ చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు పలుకోణాల్లో విచారణ జరుపుతున్నారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గంజాయి క్రయవిక్రయాల కేసులో సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్‌లో నలుగురిని శనివారం అరెస్ట్‌చేశామని టౌన్‌సీఐ కె కృష్ణ తెలిపారు. పట్టణంలోని విద్యానగర్ సమీపంలోగల శ్మశానవాటిక వద్ద గంజాయి క్రయవిక్రయాలకు పాల్పడుతున్న సాయినగర్‌కు చెందిన షేక్‌షారుక్‌ఖాన్(25), శాంతినగర్‌కుచెందిన మూషం శివకుమార్ (22), గడదాస్‌శివ(24), బీవైనగర్‌కు చెందిన మహ్మద్‌గౌస్(22)లను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు. వీరివద్ద 200గ్రాముల గంజాయిని, నాలుగు మొబైల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నాలుగురోజుల క్రితం కరీంనగర్‌లోని ఆర్టీసీ బస్టాండ్ వద్దకు వెళ్లి రూ.10వేలకు 400 గ్రాముల గంజాయిని షేక్‌షారుక్ ఖాన్ కొనుగోలుచేసి సిరిసిల్లలోని తన పరిచయస్తులకు 150గ్రాముల గంజాయిని విక్రయించాడన్నారు. మిగిలిన 250గ్రాముల గంజాయిని తనవద్దనే పెట్టుకొని 50గ్రాముల ప్యాకెట్లు చేసుకున్నాడన్నారు. ఇందులో 50 గ్రాముల గంజాయినితాగి మిగతా మూడు ప్యాకెట్లు మూషం శివకుమార్, మహ్మద్ గౌస్, గడదాస్‌శివకు రూ.4500కు విక్రయించాడన్నారు. ఇదేసమయంలో సమాచారం రావడంతోవెళ్లి అరెస్ట్‌చేసి కేసు నమోదుచేసి నలుగురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించామన్నారు. గంజాయిని అక్రమంగా రవాణా చేసినా కొనుగోలుచేసినా, అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

బైపాస్ రోడ్‌లో అఘోరీమాత హల్‌చల్



పెద్దపల్లి బైపాస్‌రోడ్‌లో కారు వద్ద నిలుచున్న అఘోరీమాత

కరీంనగర్ క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా వార్తల్లో నిలుస్తున్న అఘోరీ మాత శనివారం రాత్రి కరీంనగర్ శివారులోని బొమ్మకల్ బైపాస్‌రోడ్‌లో కొద్దిసేపు హల్‌చల్ చేశారు. కారులో వెళతుండగా కొందరు అకతాయిలు అఘోరీమాతను అడ్డుకుని సెల్ఫీ తీసుకోవాలని ఒత్తిడి తేవటంతో వాగ్వాదం జరిగింది. ఆకతాయిలు ఆమె కారుకు వారి కారును అడ్డుపెట్టి అడ్డుకున్నారు. 100కు కాల్ చేయటంతో సమాచారం అందుకున్న కరీం నగర్ మూడో ఠాణా సీఐ జాన్‌రెడ్డి తన సిబ్బందితో సహాఅక్కడికి చేరుకుని అఘోరీమాతను అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించగా ఆమె పెద్దపల్లి వైపు తన కారులో వెళ్లింది. అఘోరీ కరీంనగర్‌లోనే రెండు రోజులుగా ఉంటున్నట్లు సమాచారం. పోలీసుల రాకను గమనించిన ఆకతాయిలు కారును అక్కడే వదిలేసి పారిపోయారు. కారును పోలీసులు ఠాణాకు తరలించారు.

డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన వ్యక్తి అరెస్టు

శంకరపట్నం, జనవరి25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి చిట్‌ఫండ్ డబ్బులు ఇవ్వకుండా మోసం చేసినవ్యక్తిని కేశవపట్నం పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు కేశవపట్నం ఎస్‌ఐ కొత్తపల్లి రవి శనివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన జన్నపురెడ్డి మధుసూదన్‌రెడ్డికి హుజూరాబాద్‌లోని విద్యానగర్‌కు చెందిన చిట్‌ఫండ్ నిర్వాహకుడు వేముగంటి శ్రీనివాస్‌ద్వారా రూ.4.64లక్షలు రావాల్సిఉంది. చిట్టిడబ్బులు ఇవ్వకుండా మోసం చేసినందుకు చిట్‌ఫండ్ యాక్టులో కేసు నమోదు చేసి, వేముగంటి శ్రీనివాస్‌ను అరెస్టుచేసి హుజూరాబాద్ కోర్టుకు రిమాండ్ నిమిత్తం తరలించినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

వెల్గటూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉమ్మడి వెల్గటూర్ మండలంలోని ఎండపల్లికి చెందిన సూరఉదయ్‌కిరణ్(24) అనే యువకుడు చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. ఎస్సైఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం ఉదయ్‌కిరణ్ ఈనెల 21న తన స్నేహితుడు కనుకుంట్ల రవితేజతోకలిసి ద్విచక్ర వాహనంపై కొండాపూర్ వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డారు. ఈసంఘటనలో ఉదయ్‌కిరణ్ తలకు తీవ్రగాయాలుకాగా కరీంనగర్ ఓప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతిచెందాడు. మృతుడితండ్రి కుమార స్వామిఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామం మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు. వాహనాలతనిఖీల్లో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో ఓ ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా, అనుమతి పత్రాలు చూపాలన్నారు. ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో అదుపులోకి తీసుకొని డ్రైవర్ ఏరుకొండ మోహన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మోదీ పాలనలోనే అన్ని వర్గాల అభివృద్ధి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తాచాటాలి - కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ పాలనలోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తాచాటి రెండు స్థానాలను కైవసం చేసుకునే దిశగా పనిచేయాలన్నారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను ఇంటింటికీ ప్రచారం చేసి ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్లు అభ్యర్థించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో చేసిన మోసాలను ఓటర్లకు వివరించాలన్నారు. నిరుద్యోగభృతి, 2 లక్షల ఉద్యోగాల భర్తీ, పీఆర్సీ పెంపు, 317 జీవో సవరణ, డీఏ బకాయిల చెల్లింపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను తుంగలో తొక్కిన అంశాన్ని విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ సందర్భంగా బీజేపీ ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు మల్క కొమురయ్య, గోదావరి అంజిరెడ్డిలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పరిచయం చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థులు మల్క కొమురయ్య, గోదావరి అంజిరెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ప్రతాప రామక్రిష్ణ, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీమేయర్ డి శంకర్ పాల్గొన్నారు.

లీగల్ ఎయిడ్ ద్వారా ఖైదీల పిల్లలకు సాయం అందిస్తాం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి ప్రతిమ

కరీంనగర్ క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జైలులో ఉన్న ఖైదీ ల పిల్లలకు లీగల్ ఎయిడ్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి ప్రతిమ అన్నారు. శనివారం కరీం నగర్ జైలులో ఖైదీల హక్కులు, బాధ్యతలు, ఖైదీలకు అందిస్తున్న న్యాయసేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి ప్రతిమ మాట్లాడుతూ ఖైదీలు పిల్లల చదువు నిర్లక్ష్యం చేయవద్దని, వారు ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా విద్య అందించాలన్నారు. ఖైదీలు మానసికంగా దృఢంగా ఉండాలని, అధైర్య పడకూడదని సూచించారు. ముద్దాయిలు స్వయంగా, వ్యక్తిగతంగా మార్పు చెందాలని అన్నారు. పేద ఖైదీలకు ప్రభుత్వ న్యాయ వాదులను నియమించి న్యాయ సహాయాన్ని అందిస్తామని అన్నారు. ఖైదీల హక్కులు, బాధ్యతలను వారికి అందిస్తున్న న్యాయ సహాయం గురించి ప్రధాన న్యాయమూర్తి వివరించారు. ఖైదీలు నేరాలు చేయకుండా సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని కోరారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తరువాత కొత్త జీవితాన్ని ప్రారంభించి సరైన మార్గంలో నడవాలని సూచించారు. జైలులో ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాల గురించి సంతృప్తి వ్యక్తం చేస్తూ జైలు అధికారులను, సిబ్బందిని అభినందించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కె వెంకటేష్ మాట్లాడుతూ జైలుకు వచ్చిన ఖైదీల సమస్యలను తెలుసుకుని వారికి న్యాయ సేవా పరంగా అవసరమైన సహకారాన్ని అందిస్తున్నామని, లీగల్ సర్వీస్ అథారిటీ ద్వారా లీగల్ అడ్వకేట్‌లను జైలుకు పంపించి సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. అవగాహన కార్యక్రమంలో జిల్లా జైలు సూపరిండెంట్ కె శ్రీనివాస్, జైలు వైద్యాధికారి కె వేణుగోపాల్, జైలర్ పి శ్రీనివాస్, బి రమేష్, యు పరశురాం, డిప్యూటిజైలర్‌లు ఏ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ సుధాకర్‌రెడ్డి, ఎల్ రమేష్ నాయక్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లాయర్ తనుకు మహేష్, పి పరశురాములు, ఎస్ మల్లేశం, జ్యోతి, ఖైదీలు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో రాచర్ల కోట


ఆనవాళ్లు కోల్పోయిన రాచర్లకోటలోని సింహ ద్వారం(వెనుక దిడ్డి)

- కాల గర్భంలో కనుమరుగవుతున్న అద్భుత కట్టడం
- నాటి నైపుణ్యానికి స్మృతి చిహ్నంగా శిల్ప ఖండాలు
- మాయమవుతున్న చారిత్రక సంపద.. పట్టించుకునే వారు కరువు

ఎల్లారెడ్డిపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలో ప్రాచీన వారసత్వ సంపదకు ఆదరణ కరువైంది. మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని రాచర్ల కోట నిర్లక్ష్యానికి గురవుతోంది. గుప్త నిధుల వేట.. కబ్జాదారుల స్వార్థం.. అధికారుల అలసత్వం.. వెరసి.. ఆనాటి సంస్కృతులను ప్రతిబింబించే అద్భుత కట్టడం కాలగర్భంలో కలిసిపోతోంది. అపురూపమైన శిల్ప కళా సంపద కనుమరుగైపోతోంది. పూర్వీకుల నుంచి వారసత్వంగా సంక్రమించిన సంపదను భావితరాలు భౌతికంగా తిలకించలేని దుస్థితి నెలకొంది.

● ఉనికి కోల్పోయిన గత వైభవం..

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని రాచర్ల కోటకు శతాబ్దాల చరిత్ర ఉంది. కాకతీయుల సామ్రాజ్యానికి కోట వేదికగా నిలిచింది. సింగమ మహారాజు రాచర్ల పట్టణాన్ని పరిపాలించాడని చారిత్రక ఆధారాలున్నాయి. ఆసమయంలో చారిత్రక కట్టడాలు, దేవాలయం నిర్మించారు. అద్భుత శిల్ప కళాకృతులు రూపొందించారు. శత్రురాజుల దాడి నుంచి రాజ్యాన్ని కాపాడుకోవడానికి కోట చుట్టూ ఎత్తయిన ప్రహారీని నిర్మించారు. దానికి అవతలి వైపు కోట చుట్టూ తీసిన లోతైన కందకంలో ఎల్లప్పుడు నీరు ఉండేలా చేసి శత్రు దుర్భేద్యంగా మార్చారు. కోటకు పడమర దిశలో ఉన్న సింహద్వారానికి (వెనుక దిడ్డి) ఆనుకుని ఓ చెరువు, ద్వారం పక్కనే


శిథిలమైన శివాలయం

అబ్బురపరిచే రాతి శిల్పాలతో నిర్మితమైన శివాలయం ఉన్నాయి. సింగమ మహారాజు కోటలోని రహస్యాన్ని తెలుసుకున్న గోల్కొండ రాజు దండయాత్ర చేసి సామ్రాజ్యాన్ని అంతం చేశాడని చరిత్రకారులు చెబుతున్నారు. శతాబ్దాల కాలం నాటి శిల్ప కళా నైపుణ్యం మధుర స్మృతులు కాలక్రమేణా కనుమరుగైపోయాయి. కోటలోని కళా ఖండాలను నిజాం సర్కారు హైదరాబాద్‌లోని సాలార్జంగ్ మ్యూజియానికి తరలించారని స్థానికులు పేర్కొంటున్నారు. మరికొన్ని రాతి స్థూపాలను చుట్టు పక్కల గ్రామాల్లోని ఆలయాల నిర్మాణాలకు వినియోగించారు. శిల్ప కళా సంపద అవశేషాలు కోటలో అక్కడక్కడా విసిరేసినట్లు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. నాటి సంపద కోటలో మిగిలిపోయిందని కొందరు గుప్త నిధుల కోసం ఆ ప్రాంతంలో తవ్వకాలు చేపట్టిన సంఘటనలు ఉన్నాయి. సాంస్కృతిక ఆనవాళ్లను అక్రమార్కులు దర్జాగా కబ్జా చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదని చరిత్రకారులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.

● గ్రామాలకు ముందు 'రాచర్ల'

గోల్కొండ రాజు కోటపై దండయాత్ర చేయడంతో ప్రజలు ప్రాణభయంతో పారిపోయి పరిసర ప్రాంతాల్లో స్థిర నివాసాలను ఏర్పర్చుకున్నారు. దాంతో ఆ గ్రామాల పేర్లకు ముందు 'రాచర్ల' చేరిపోయింది. తద్వారా వెలసిన రాచర్ల గొల్లపల్లి, రాచర్ల బొప్పాపూర్, రాచర్ల తిమ్మాపూర్, రాచర్ల గుండారం గ్రామాలు అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని రాచర్ల కోటలో చారిత్రక సంపదను రక్షించాలని స్థానికులు, చరిత్రకారులు కోరుతున్నారు.

మా ఇంటి పేరే రాచర్ల..

- రాచర్ల రఘురామశర్మ, పురోహితుడు, రాచర్లగొల్లపల్లి



రాచర్ల కోట సింగమ మహారాజు పరిపాలనలో తమ వంశస్థులు గురువులుగా ఉన్నారని మా తాతలు చెప్పేవారు. రాచర్ల కోటలో గురువులుగా ఉండడం వల్ల మా ఇంటి పేరు రాచర్లగా మారిందని చెబుతుండేవారు. అప్పటి నుంచి మా ఇంటి పేరు రాచర్లగా వస్తోంది.

కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి..

- వాసరవేణి పర్శరాములు, పరిశోధకులు, సింగారం



రాచర్ల కోటను అధికారులు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. చారిత్రక సంపదను కాపాడడంతో పాటు కోట ప్రాంతంలోనే మ్యూజియం ఏర్పాటు చేయాలి. నాటి శిల్ప ఖండాలను భద్రపరిస్తే భవిష్యత్తు తరాలకు గత చరిత్ర తిలకించే, తెలుసుకునే అవకాశాలుంటాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డీఎఫ్‌వో

కొడిమ్యాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల డీఎఫ్‌వో ఎం రవిప్రసాద్ సూచించారు. రెండురోజుల క్రితం మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో గుడిసెలో కట్టేసిన ఆవు పెద్దపులి దాడిలో మృతి చెందింది. శనివారం జగిత్యాల డీఎఫ్‌వో అటవీ అధికారులతో పెద్దపులి సంచరించి, ఆవుపై దాడిచేసిన అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో గ్రామస్థులతో మాట్లాడుతూ బాధితుడికి ప్రభుత్వపరంగా నష్టపరిహారం అందిస్తామన్నారు. సంఘటన స్థలంలో పెద్దపులి అడుగులు ఉన్నట్లు తాము గుర్తించామన్నారు. పొలాలకు వెళ్లేటప్పుడు ఎక్కువ మంది కలిసి వెళ్లాలన్నారు. అనంతరం కొడిమ్యాల రేంజ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పెద్దపులి తిరిగిన ఆనవాళ్లు ఎక్కడ కనిపించినా తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ప్రజలు ఎలాంటి భయాన్ని పెట్టుకోవద్దని గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్, డీఆర్వోలు ముషీర్‌అహ్మద్, మోనిక, సెక్షన్ ఆఫీసర్లు రత్నమ్మ, సుబ్బారావు, బీట్ అధికారులు ఆనందరావు, ప్రవీణ్, అశ్విని, ఫిరోజ్, ఉన్నారు.


పెద్దపులి అడుగులను పరిశీలిస్తున్న సిబ్బంది

25 రోజులు.. నలుగురు ఈవోలు

- కొండగట్టు దేవస్థానంలో నియామకం
- ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు చేపట్టిన కృష్ణప్రసాద్


డి కృష్ణప్రసాద్

మల్యాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో 25 రోజుల వ్యవధిలో నలుగురు ఈవోలుగా బాధ్యతలు చేపట్టారు. తాజాగా శనివారం ఆలయ ఇన్‌చార్జి ఈవోగా డి కృష్ణప్రసాద్ చేరారు. ఈనెల 3న ఇక్కడి ఈవో రామకృష్ణరావు బదిలీతో వేములవాడ ఈవో వినోద్‌రెడ్డి ఇన్‌చార్జిగా విధులు నిర్వహించారు. ఆయన స్థానంలో ఈవోగా టి శ్రీకాంతరావును దేవాదాయశాఖ నియమించగా ఈనెల 18న విధుల్లో చేరారు. అనంతరం మూడు రోజుల్లోనే నెలరోజుల సెలవుపై వెళ్లారు. తాజాగా హైదరాబాద్‌లో దేవాదాయశాఖలో డిప్యూటి కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న డి కృష్ణప్రసాద్‌ను ఇన్‌చార్జి ఈవోగా నియమించడంతో శనివారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. దీంతో ఇరవైఐదు రోజుల్లో నలుగురు ఈవోలు బాధ్యతలు చేపట్టినట్లు అయింది. అంతకుముందు ఈవో కృష్ణప్రసాద్ ఆలయంలో అంజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. కృష్ణప్రసాద్ గతంలో ఇక్కడ రెగ్యులర్ ఈవోగా విధులు నిర్వహించారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు

- బాలికల విభాగంలో రూరల్ చాంపియన్‌షిప్ సాధించిన కరీంనగర్



ట్రోఫీతో కరీంనగర్ పాలిటెక్నిక్ కళాశాల బాలికల జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి పాలిటెక్నిక్ కళాశాల క్రీడా పోటీలు శనివారం సాయంత్రం ముగిశాయి. రెండు రోజులుగా జిల్లా కేంద్రానికి సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీల్లో బాలికల విభాగంలో అంబేద్కర్ పాలిటెక్నిక్ కళాశాల కరీంనగర్, బాలుర విభాగంలో ఎస్సారార్ఎస్ పాలిటెక్నిక్ కళాశాల సిరిసిల్ల ఓవరాల్ చాంపియన్ షిప్‌లను సాధించాయి.

పోటీల ముగింపు సమావేశా నికి ముఖ్య అతిథిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రభుత్వ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డి శివరాణి హాజరై విజేతలకు బహుమతులను, ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను ప్రదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడలతో స్నేహసంబంధాలు పెంపొందుతాయన్నారు. క్రీడాకారులు భవిష్యత్తులో చిన్న చిన్న విషయాలకు కుంగిపోకుండా ధైర్యంతో ముందుకు సాగాలన్నారు. రెండు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు అధికారులందరికీ ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కల్పించామన్నారు. 600 మంది క్రీడాకారులు రెండు రోజులపాటు వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ, అథ్లెటిక్స్, తదితర క్రీడాంశాల్లో పాల్గొని ప్రతిభ చాటారన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు కే వెంకటేశ్వర్లు, ఎం చంద్రప్రకాశ్, బి ఝాన్సీ, సీహెచ్ స్వప్న, ఏవో నజీముద్దీన్, ఫిజికల్ డైరెక్టర్ జి తుల్జారాం షా, తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో హెచ్‌ఎంకు బహుమతి


బహుమతి అందుకుంటున్న హెచ్‌ఎం

రాయికల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆరురాష్ట్రాల దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో రాయికల్ మండలం కుమ్మరిపెల్లి ప్రధానోపాధ్యాయుడు కడకుంట్ల అభయ్ రాజ్ బహుమతి అందుకున్నాడు. ఈ నెల 21 నుంచి 25 వరకు పుదుచ్చేరిలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో అభయ్ రాజ్ రూపొందించిన తక్కువ ఖర్చు, ఖర్చు లేని బోధనోపకరణాలతో కూడిన సూపర్ సైన్స్ కిట్‌కు ప్రత్యేక బహుమతి లభించింది. ఈ సందర్భంగా పుదుచ్చేరి ఎస్‌సీఆర్‌టీ డైరెక్టర్ ప్రియదర్శిని, జాయింట్ డైరెక్టర్ శివగామి చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు. అభయ్‌రాజ్‌ను జిల్లా విద్యా శాఖాధికారి రాము, జిల్లాసైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్, మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు అభినందించారు.

త్యాగధనుల స్మరణ.. కొలనూరులో కొనసాగుతున్న నిత్య జనగణమన


కొలనూరులో నిత్య జనగణమన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు (ఫైల్)

కోనరావుపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా కొలనూర్‌లో మొట్టమొదటిసారిగా త్యాగధనులను స్మరిస్తూ నిత్య జనగణమనను గ్రామస్థులు కొనసాగిస్తున్నారు. కోనరావుపేట మండలం కొలనూరులో 2018లో నిత్య జనగణమన కార్యక్రమాన్ని అప్పటి కలెక్టర్ కృష్ణభాస్కర్ ఆధ్వర్యంలో పారంభించారు. ఆనాటి నుంచి నిత్య జనగణమనను కొనసాగిస్తున్నారు. ఉదయం 8 గంటలకు గ్రామపంచాయతీ మైకు ద్వారా జనగణమన సైరన్ రాగానే ఎక్కడ ఉన్న గ్రామస్థులు అక్కడే నిలబడి నిత్య జనగణమనలో పాల్గొంటున్నారు. అప్పటి సర్పంచ్ అబ్దుల్ రషీద్, డీపీఆర్‌వో మామిండ్ల దశరథం, ఇతర అధికారుల సమక్షంలో జనగణమన ప్రారంభమై ఇప్పటికీ కొనసాగుతోంది.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ


ధర్మపురి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. పుష్య మాసం సందర్భంగా క్షేత్రానికి భారీగా భక్తులు తరలివచ్చారు. స్థానిక లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ రామలింగేశ్వస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. భక్తులకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది తగు సేవలు అందించారు.

● అంజన్న ఆలయంలో..

మల్యాల (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానంలో శనివారం భక్తులతో రద్దీ నెలకొంది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

● 30న హుండీల లెక్కింపు

ఈ నెల 30 ఆలయ హుండీల ఆదాయంను లెక్కింపు చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇటీవల ఈవో మార్పుతో లెక్కింపునకు ఆలస్యం కాగా నూతన ఈవో బాధ్యతలు చేపట్టడంతో గురువారం లెక్కింపునకు నిర్ణయించారు.


కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో భక్తులు

మొక్కజొన్నలో కత్తెర పురుగు

- పీచు దశలో దెబ్బతింటున్న పంట
- మందులు పిచికారి చేసినా అదుపు కావడం లేదంటున్న రైతులు


సైదాపూర్ మండలంలోని రాంచంద్రాపూర్‌లో పీచు దశకు చేరుకున్న మొక్కజొన్న


మొక్కజొన్నను తింటున్న కత్తెరపురుగు

సైదాపూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంట పీచుదశలో కత్తెర పురుగు సోకుతోంది. పురుగు మందులు పిచికారి చేసినా కత్తెర పురుగు అదుపు కావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. సైదాపూర్ మండలం మెట్ట ప్రాంతం కావడంతో చాలా మంది రైతులు ఆరుతడి పంట అయిన మొక్కజొన్న పంట సాగు చేశారు. పత్తి పంట చేతికి రావడంతో ఆ మొక్కలు తీసివేసి మొక్కజొన్న వేశారు. మండలంలో ఈ యాసంగి సీజన్‌లో నాలుగువేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగవుతోంది. వాతావరణ పరిస్థితో.. మరే కారణమో.. మొక్కజొన్నకు పీచుదశలో కత్తెరపురుగు సోకింది. ఈ పురుగు మొక్కజొన్న కర్రలను పూర్తిగా తినేస్తోంది. ఆ కత్తెర పురుగు సోకిన కర్ర స్ప్రే చేసినా కోలుకునే అవకాశం లేదు. రెండున్నర నెలలుగా కష్టపడి మొక్కజొన్నను పీచు దశకు తీసు వస్తే చివరిదశలో కత్తెరపురుగు రావడం రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇంకో నెల రోజులు అయితే పంట చేతికి వచ్చే సమయంలో చీడ పీడలు ఆశించడం ఇబ్బందిగా ఉందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయాధికారులు స్పందించి ప్రత్యామ్నాయ మార్గం చూపాలని రైతులు కోరుతున్నారు.

● కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు

మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి సైదాపూర్ మండల వ్యవసాయశాఖ అధికారి వైదేహి వివరించారు.

- మొక్కజొన్న విత్తిన వెంటనే ఎకరానికి 10-15 లింగాకార్షన బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి.
- విత్తిన 7-10 రోజుల తర్వాత వేప నూనె (అజాడిరక్టిన్ 1500 పీపీఎం) లీటర్, ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి మందు మొత్తం మక్క సుడులలో పడే విధంగా పిచికారి చేయాలి.
- పురుగు తీవ్రతను బట్టి పంట విత్తిన 20-25 రోజుల తర్వాత క్లోరాంట్రానిలిప్రొల్ 80 మిల్లీలీటర్లు, వేపనూనె (అజాడిరక్టిక్ 1500 పీపీఎం) ఒక లీటరు, 200లీటర్ల నీటిలో కలిపి మొక్కలు మొత్తం పూర్తిగా తడిచేలా పిచికారి చేయాలి.
- పురుగు కనిపించిన వెంటనే పొడి ఇసుకను మొక్కజొన్న సుడులలో చల్లితే ఇసుక రాపిడికి లార్వాలు చనిపోతాయి. చిక్కటి ఎర్రమట్టి బురద నీటిని మొక్కజొన్న మొక్క మొవ్విలో పోస్తే కత్తెర పురుగు లార్వాలు ఊపిరి ఆడక చనిపోతాయి.
- ఎదిగిన లార్వా నివారణకు విషపు ఎరను మొక్క సుడిలో ఏర్పాటు చేసుకోవాలి

● విషపు ఎర తయారీ విధానం:

ఎకరానికి 10 కిలోల తవుడు, 2 కిలోల బెల్లం తీసుకొని బెల్లాన్ని 2-3 లీటర్ల నీటిలో కరిగించి తవుడులో కలిపి 24 గంటలు పులియనివ్వాలి. అరగంట ముందు ఈ మిశ్రమానికి వంద గ్రాముల థయోడికార్బ్ మందును కలిపి విషపు ఎరను మొక్క సుడిలో వేయాలి.

● జీవనియంత్రణ పద్ధతులు

కత్తెర పురుగు నివారణకు జీవ కీటక నాశినులైన నోమేరియా రిలే లేదా మెటారైజియం ఎనైసోప్లియె లేదా బివేరియా బాసియాన లేదా ఈపీఎన్ 5 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి సాయంకాలం వేళలో పిచికారి చేయాలి.

కత్తెర పురుగు అదుపు కావడం లేదు

- ఆవుల రాజు, మొక్కజొన్న రైతు, జాగీర్‌పతి



నాలుగు ఎకరాల భూమిలో మొక్కజొన్న పంట సాగు చేశాను. విత్తనాలు వేసినప్పటి నుంచి అన్ని జాగ్రత్తలు తీసుకున్నాను. మొక్కజొన్న ఏపుగా పెరిగి పీచు దశకు వచ్చింది. ఈ దశలో కత్తెర పురుగు సోకి ఆకులు, చెట్లను పూర్తిగా తింటోంది. మూడు సార్లు పురుగు మందు స్ప్రే చేశాను. అయినా అదుపు కావడం లేదు. అధికారులు స్పందించి కత్తెరపురుగు అదుపు చేసేందుకు తగిన మార్గం చూపించాలి.

న్యూస్ బాక్స్

కొండాపూర్ వాసికి సన్మానం

ముస్తాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బహదూర్ హసీనా కుమారుడు రఫీక్ ఏఈగా ఉద్యోగం సాధించారు. శుక్రవారం జరిగిన ఫలితాల్లో ఆర్అండ్‌బీలో ఏఈగా ఉద్యోగం సాధించాడు. రఫీక్‌ను సర్పంచ్ యారటి లక్ష్మీ, గ్రామస్థులు యారటి కరుణాకర్, డైరెక్టర్ క్యారం రాజు, మహేశ్ యాదవ్, బొందుగుల దేవిరెడ్డి, గాంత రాజు తదితరులు సన్మానించారు.

నిరుపేదలకు అండగా సీఎం సహాయనిధి..

ఇల్లంతకుంట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నిరుపేద ప్రజలకు అండగా సీఎం సహాయనిధి ఉందని కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి పేర్కొన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్, రేపాక తదితర గ్రామాల్లో శనివారం సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీలు కరివెద స్వప్నకర్ణాకర్‌రెడ్డి, కాథ సుమలత మల్లేశం, గ్రామశాఖ అధ్యక్షులు కేతిరెడ్డి వెంకటరెడ్డి, ద యాసాగర్, రవీందర్, నవీన్‌రెడ్డి, రొండ్ల రాజిరెడ్డి, నందిరెడ్డి, లింగం, గూడ బాబు, డిష్ రవి, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పేదలకు వరమని ముస్తాబాద్ మండల కాంగ్రెసస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాంరెడ్డిపల్లే గ్రామానికి చెందిన పల్లె ఎల్లవ్వకు సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం అందించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు,ఉచ్చిడి బాల్‌రెడ్డి, అన్నం శ్రీధర్‌రెడ్డి, తాళ్ల విజయ్‌రెడ్డి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

బోయినపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం వెంకటరావుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రిటైర్డ్ ఎంఈవో చిన్న మాధవుని రామరాజు రూ.5 వేల నగదును అందజేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేయడానికి తనవంతు విరాళాన్ని అందజేశానని రామరాజు తెలిపారు.

● ఇల్లంతకుంట : మండలంలోని పెద్దలింగాపూర్ అంబేద్కర్ సంఘ భవనానికి మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ ఆర్థిక సాయం అందించారు. సంఘభవనానికి రంగులు వెలిసిపోవడంతో స్పందించి ఆర్థికసహాయం అందించారు.

బెదిరించడం సరికాదు

రుద్రంగి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మ్యాకల పరుశురాములను ఫోన్ ద్వారా బెదిరించడం సరైనది కాదని సంఘం మండల అధ్యక్షుడు మీసాల మల్లేష్ పటేల్ అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ బీసీల ఉద్యమాన్ని ఆపాలంటూ పరశురాంను బెదిరించడాన్ని ఖండిస్తున్నామని, దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. ప్రధాన కార్యదర్శి, పిల్లమరపు ప్రవీణ్, కోశాధికారి, లంకదాసరి శ్రీనివాస్, కార్యదర్శి లింగంపెల్లి జయంత్ కుమార్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ నంద్యాదాపు సాయికృష్ణ, బొమ్మేన స్వామి, మర్రిపెల్లి రవి,మంచే శ్రీనివాస్, గట్ల రాజు,సాగర్, ఎల్ రంజిత్, తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం





ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, ముస్తాబాద్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ సురేశ్ తదితరులు

సిరిసిల్ల క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధమని, ఓటు హక్కును వినియోగించుకోవడం మన అందరి బాధ్యతని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటర్లుగా నమోదుచేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ మురళీకృష్ణ, ఆర్ఐలు మధూకర్, రమేశ్, ఎస్ఐలు పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల పట్టణంలో సెస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ఓటింగ్ జరిగే విధానంపై విద్యార్థులకు అవగహన కల్పించడంతో పాటు మాక్ పోలింగ్ నిర్వహించారు. అశోక్‌నగర్‌లోని వివేకనంద విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కరస్పాండెంట్ దిడ్డి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ బుచ్చారావు, మహేందర్‌రెడ్డి, జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ వనజాకుమారి, అధ్యాపకులు ఎం సునీత, నవీన్‌కుమార్, సయ్యద్‌జబీ, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, గంగరాజు, సునీత, అఫ్రోజ, అనితా, భూపాల్, రహీం, ప్రకాష్, స్వప్న, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : ముస్తాబాద్‌లో ఓటు హక్కుపై స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాల, శ్రీవాణి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో బీరయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఈవో రమేశ్, డీటీ భూపేశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఎంఈవో రాజిరెడ్డి, ఎల్లారెడ్డి, గోవర్ధన్, భాను, ఎల్లారెడ్డి, తుమ్మ రాజేందర్, ఆనందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు ఓటరు ప్రతిజ్ఞచేశారు. పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మాక్ పోలింగ్‌ను చేపట్టారు. ఎంపీడీవో సత్తయ్య, ఆర్ఐ సంతోష్, అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో జాతీయ ఓటర్ల దినోత్సవం శనివారం నిర్వహించారు. అనంతరం అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలందరూ కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ మారుతిరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాములు నాయక్, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ లక్ష్మణ్, ఎంపీడీవో అబ్దుల్ వాజిద్, ఎస్ఐ ఎల్లాగౌడ్, ఎంఈవో శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, బీఎల్వోలు జ్యోతి, నాగరాణి తదితులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● రుద్రంగి : జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు శనివారం ఓటు హక్కును వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై కన్నీరాం, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నూతన పథకాల ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలి

- ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేయాలి
- గణతంత్ర దినోత్సవం రోజే లబ్ధిదారులకు పథకాలు చేరాలి
- రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అధికారులు

సిరిసిల్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం రోజున ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్‌కార్డుల జారీ పథకాలను లాంఛనంగా ప్రతి మండలంలో ఒక గ్రామంలో ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. గణతంత్రం రోజు నూతన పథకాల ప్రారంభ ఏర్పాట్లపై శనివారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ, వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించినందుకు అధికారులకు ముందుగా అభినందనలు తెలిపారు. ప్రతి మండలంలో 250నుంచి 400వరకు ఇండ్లు ఉన్న గ్రామాలను స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ గ్రామాలను ఎంపిక చేయాలని అన్నారు. ప్రజాపాలన ప్రారంభించే గ్రామాల జాబితా, గ్రామాలలో నాలుగు పథకాల లబ్ధిదారుల వివరాలను నిర్ణీత నమూనాలలో పంపించాలని అన్నారు. జనవరి 26న ఎంపిక చేసిన గ్రామాలలో మధ్యాహ్నం ఒంటి గంటకు నాలుగు పథకాలను అధికారికంగా ప్రారంభించాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగాలని, పథకాలకు సంబంధించి సదరు గ్రామాల్లో అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరేలా చూడాలని అన్నారు. నూతన పథకాలలో అర్హులు మాత్రమే జాబితాలో ఉండేలా అప్రమత్తంగా ఉండాలని, గ్రామసభలలో స్వీకరించిన నూతన దరఖాస్తులను సైతం పరిశీలించి అర్హులు ఉంటే జాబితాలో పొందుపర్చాలని అన్నారు. నూతన రేషన్‌కార్డుల జారీని తహసీల్దార్ బృందం, ఇందిరమ్మ ఇండ్ల జాబితాను ఎంపీడీవో బృందం, రైతు భరోసా జాబితాను మండల వ్యవసాయ అధికారి బృందం, ఇందిరమ్మ రైతు భరోసా జాబితాను ఏపీవో బృందం పరిశీలించి, అర్హులు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నూతన పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరగాలని, పథకాలకు సంబంధించి లబ్ధిదారులు ప్రారంభ కార్యక్రమానికి వచ్చేలా చూడాలని, లబ్ధిదారుల వివరాలను గ్రామాల్లో ప్రదర్శించాలని తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి ప్రతి గ్రామంలో మంచి ఆడియో, వీడియో ఏర్పాట్లు చేయాలని, ముందస్తుగా ముఖ్యమంత్రి సందేశాన్ని ప్రతి గ్రామంలో ప్రదర్శించాలన్నారు. పథకాలకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రజలకు మరోసారి వివరించాలని, ఎంపిక చేసిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు జారీ చేయాలని, అనంతరం ప్రజాప్రతినిధులు తమ సందేశాలు వినిపించాలని, కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులను, ప్రభుత్వ సలహాదారులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లను ఆహ్వానించాలని పేర్కొన్నారు. పథకాల ప్రారంభం కోసం ఎంపిక చేసిన గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపి, క్షేత్రస్థాయి విచారణ చేయాలని, దరఖాస్తులలో అర్హులు ఉంటే పేర్లు నమోదు చేసి పథకాలను సంబంధిత లబ్ధిదారులకు వర్తింపజేయాలని అన్నారు. ప్రతి మండలంలో పథకాల ప్రారంభోత్సవానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, ఎక్కడ ఎటువంటి గందరగోళం జరిగేందుకు వీలు లేదని, ప్రభుత్వ పథకాలు అర్హులైన చివరి లబ్ధిదారుడు వరకు చేరుతాయనే విశ్వాసాన్ని ప్రజలలో కల్పించాలని అన్నారు.

జిల్లాలో 40,360 దరఖాస్తులు...

జిల్లాలో నాలుగు పథకాల గ్రామ సభల్లో 40360 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కాన్ఫరెన్స్‌లో వివరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 255 గ్రామసభలు, 67 మున్సిపల్ వార్డు సభలు విజయవంతంగా నిర్వహించామని అన్నారు. నూతనంగా రేషన్ కార్డులకు 16505, ఇందిరమ్మ ఇండ్లకు 14542, రైతు భరోసాకు 141, ఇందిరమ్మ ఆత్మీయభరోసాకు 9172 దరఖాస్తులు వచ్చాయని ప్రభుత్వ ఆదేశాల మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఆర్‌డీఏ శేషాద్రి, ఎస్‌డీసీ రాధాబాయి, వ్యవసాయ అధికారి అఫ్జల్‌భేగం, ఉద్యానవన శాఖ అధికారి లత, పౌరసరఫరాల అధికారి వసంతలక్ష్మీ, మేనేజర్ రజిత, ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్, గృహనిర్మాణ శాఖ చెన్నయ్య, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జడ్పీ సీఈవో వినోద్, డీసీవో రామకృష్ణ, మైనింగ్ ఏడీ క్రాంతి, డీపీఆర్వో శ్రీధర్, తదితరులు ఉన్నారు.

ఎంపిక చేసిన గ్రామాలు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో నాలుగు పథకాలను లాంఛనంగా ప్రారంభించడానికి ఎంపిక చేసిన గ్రామాలు ఇలా ఉన్నాయి. బోయినపల్లి మండలం అనంతపల్లి, చందుర్తి మండలంలో కొత్తపేట, ఇల్లంతకుంట మండలం సిరికొండ, గంభీరావుపేట మండలంలో దమ్మన్నపేట, కోనరావుపేట మండలంలో గొల్లపల్లి, ముస్తాబాద్ మండలం కొండాపూర్, రుద్రంగి మండలంలో గాయిదిగుట్ట తండా, తంగళ్లపల్లి మండలం రాళ్లపేట, వీర్నపల్లి మండలంలో లాల్‌సింగ్ తండా, వేములవాడ రూరల్ మండలంలో వెంకటాయపల్లి, ఎల్లారెడ్డిపేట మండలం గుండారం, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో పెద్దూర్‌లో నాలుగు పథకాలకు సంబంధించిన అర్హులకు ప్రొసీడింగ్‌లు అందించనున్నారు.

బల్దియాల్లో ప్రత్యేక పాలన..

(5వ పేజీ తరువాయి)

గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు చేపట్టినా అంతంత మాత్రంగానే జరిగాయనే విమర్శలు ఉన్నాయి. కొత్త ప్రభుత్వంలో వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అభివృద్ధి వైపు దృష్టిసారించారు. ప్రత్యేక అధికారుల పాలనలో అభివృద్ధి ఎలా జరగనుందోననే ఆసక్తి కూడా ప్రజల్లో నెలకొంది.

బల్దియా వైపు ఆశావహుల చూపు..

అధికారంలో ప్రభుత్వం కాంగ్రెస్ ఉన్నప్పటికీ స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులే కొనసాగడంతో గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకుల్లో నిరాశగానే ఉండేది. మున్సిపల్ పాలకవర్గాల గడువుతో స్థానిక సంస్థల పాలనకు తెరపడి ప్రత్యేక అధికారుల పాలన ముందుకు వచ్చింది. ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలకు చురుకుగా ఏర్పాట్లు చేస్తోంది. ఇదేక్రమంలో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిల్‌కు కూడా ఎన్నికలు జరగనుండడంతో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల్లోని ఆశావహులు దృష్టి పెట్టారు. వార్డుల్లో సంబంధాలు పెంచుకునే దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు..



క్యారం ఆడుతున్న సీనియర్ సిటిజన్స్

సిరిసిల్ల టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సిరిసిల్ల పట్టణంలో ఆటలపోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులు గ్రంథాలయం జిల్లా ఛైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ జిల్లా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి జనపాల శంకరయ్య, ఉపాధ్యక్షులు బుర్ర నారాయణగౌడ్, శ్రీగాధ మైసయ్య, కోశాధికారి దొంత దేవదాసు, సభ్యులు పాల్గొన్నారు.

అంబేద్కర్ మాల యువజన సంఘం కార్యవర్గం

సిరిసిల్ల రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధి పెద్దూర్ గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మాల యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధికార ప్రతినిధిలుగా రెడ్డిమల్ల చిన్న దేవయ్య, కొంపెల్లి శ్రీనివాస్, గొర్రెస్వామి, రాకం చిన్న పర్శరాములు, సహాయ కార్యదర్శులుగా మంగ పర్శరాములు, బిట్ల శ్రీనివాస్, గట్టెపల్లి ఎల్లయ్య, జంగిటి రాజయ్య, కోశాధికారులుగా పల్కరవి, కొంపెల్లి బాబు, గొర్రె మల్లేశం, రాకం సుమన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీసర్పంచ్ రాకం రమేష్, సింగిల్ విండో డైరెక్టర్ మంగ కిరణ్‌కుమార్, జాన దయానంద్, రెడ్డిమల్ల దేవయ్య పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు..



విద్యార్థులకు సామగ్రిని అందజేస్తున్న మురళి నాయక్

కోనరావుపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని విద్యాధికారి మురళి నాయక్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పీఎంశ్రీ పథకం కింద వచ్చిన సామగ్రిని శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌పై ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్రపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్, భాస్కర్, రాము, వెంకటేష్, సంజీవ్, ఎస్ఎంసి ఛైర్మన్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



వట్టెంలలో గోదామును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వట్టెంల గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో 23 లక్షల రూపాల నాబార్డు నిధులతో నిర్మించిన 300 మెట్రిక్ టన్నుల ఎరువుల గోదామును శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం శాత్రాజ్ పల్లి గ్రామంలో సైడ్ డ్రైన్, బస్టాండు వద్ద జంక్షన్ అభివృద్ధి, సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేసారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గోదాముల నిర్మాణం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. శాత్రాజ్‌పల్లిలో కోటి 50లక్షలతో సెమీ అర్బన్ హాస్పిటల్ మంజూరు చేయడం జరిగిందన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామతీర్థపు మాధవిరాజు, వైస్‌ఛైర్మన్ బింగి మహేష్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రొండి రాజు, ప్యాక్స్ ఛైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, స్థానిక కౌన్సిలర్ సంఘ హనుమవ్వ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సంఘ స్వామి పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

దుబ్బ రాజేశ్వరస్వామి జాతర పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నాగాయపల్లిలో ఈ నెల 28న జరిగే శ్రీ దుబ్బరాజేశ్వరస్వామి జాతర పోస్టర్‌ను శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి ఆవిష్కరించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామతీర్థపు మాధవిరాజు, మార్కెట్‌కమిటీ ఛైర్మన్ రొండి రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, పలువురు నాయకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

ఎల్లారెడ్డిపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలో రూ.25 లక్షల ఈజీఎస్ నిధులతో తలపెట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలకు స్థానిక నాయకులు శనివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో రమేశ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, రాజురెడ్డి, రాజిరెడ్డి, అంజిరెడ్డి, బాల్‌చందర్, ఎల్లాగౌడ్, హైమద్, బాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, చంద్రయ్య, నర్సారెడ్డి, జంపయ్య, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు



వేములవాడలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సబ్‌డివిజన్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వివిధ నేరాల్లో నిందితులుగా ఉన్న రౌడీ షీటర్లు, హిస్టరీ షీట్‌లు, సెస్పెక్ట్‌గా ఉన్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్ప్రవర్తనతో జీవితాలను సరిదిద్దుకోవాలన్నారు. తరచూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నేరస్థులుగా ఉన్న వారందరు విధిగా పోలీస్‌స్టేషన్‌కు హాజరుకావాలని, లేని పక్షంలో బైండోవర్ చేస్తామన్నారు. నేరాలకు దూరంగా ఉంటు సత్ప్రవర్తనతో మెదులుతున్న నేరస్థులపై రౌడీ సీట్స్ తొలగిస్తామన్నారు. అల్లర్లతో ప్రమేయం ఉన్న వారిని ప్రతినెల పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వివరాలు సేకరిస్తున్నామన్నారు. అసాంఘిక కార్యకాలపాలకు పాల్పడితే ఉక్కుపాదం మోపుతామన్నారు. శాంతియుత వాతావరణానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, ఎస్ఐలు రాంమ్మోహన్, శ్రీకాంత్, రమాకాంత్, గణేశ్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీ, హిస్టరీ షీటర్స్‌లపై నిరంతర నిఘా

వేములవాడ : జిల్లావ్యాప్తంగా రౌడీ, హిస్టరీ షీటర్స్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వేములవాడ సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని వివిధ నేరాల్లో నిందితులుగా ఉండి రౌడీషీట్లు, హిస్టరీ షీట్లు, సస్పెక్ట్స్‌గా ఉన్న వారికి శనివారం వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్లో కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివిధ పోలీస్‌స్టేషన్లలో నేరాల్లో నిందితులుగా ఉండి షీట్లు తెరువబడిన నేరచరితులు విధిగా పోలీసులు తెలిపిన సమయాల్లో పోలీస్‌స్టేషన్‌లో హాజరుకావాలని, లేని పక్షంలో వారిని బైండోవర్ చేయడం జరుగుతుందని అన్నారు. రౌడీ, హిస్టరీ షీట్స్ ఉన్నవారిపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిఐ లు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎస్ఐలు రమేష్, మారుతి, పృథ్వీందర్ గౌడ్, అంజయ్య, అశోక్, ప్రశాంత్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన కేంద్ర బృందం



వివరాలను తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్ గ్రామాల్లోని సామాజిక ఆరోగ్య కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రాలను జనాభా పరిశోధన కేంద్ర బృందం సభ్యులు శనివారం సందర్శించారు. కేంద్రాల్లోని రికార్డులు, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ ఫ్రాన్సిస్ జేవియర్, డాక్టర్ థాంగ్, సీహెచ్‌సీ సూపరిండెంట్ ప్రదీప్‌కుమార్, వైద్యులు బాబు, రఘు, ఓంకార్, పీహెచ్‌సీ వైద్యాధికారి సారియాఅంజుమ్, డీపీవో రాజేందర్, డీడీఎం కార్తీక్, పీహెచ్ఎన్ రజని, హెల్త్ సూపర్‌వైజర్లు పద్మ, పద్మజ, ఇందిర, వైద్య సిబ్బంది ఉన్నారు.

● గంభీరావుపేట జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆసుపత్రిని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన కేంద్ర వైద్య బృందం శనివారం సందర్శించింది. గంభీరావుపేట్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవ లు, రికార్డులు కేంద్ర వైద్య బృందం సభ్యులు పరిశీలించారు. కేంద్ర బృందంలో వైద్యులు ఫ్రాన్సిస్ జేవియర్, డాంగ్, అసుపత్రి సూపరింటెండెండ్ డాక్టర్ సృజన, డాక్టర్ సింధూజ, డెంటల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సారా నాజ్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా యూనిఫాం పంపిణీ

సిరిసిల్ల టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం సుందరయ్యనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం న్యాయవాది, మాజీ ఏజీపీ బీ రవీందర్‌రావు ఉచితంగా వైట్ యూనిఫాంలను పంపిణీ చేశారు. రవీందర్‌రావుకు ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయురాలు లక్ష్మి ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

కోనరావుపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని ధర్మారం ఎస్సీ బాలుర వసతి గృహంలో శనివారం బ్లాంకెట్స్‌ను అందజేశారు.వార్డెన్ శ్రీనివాస్ ఉన్నారు.

ఎన్నికల పోలింగ్‌పై అవగాహన

కోనరావుపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మరిమడ్ల జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులు విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. హెచ్ఎం శ్రీనివాస్, బి రవి, భాస్కర్, మంజుల, శాంతకుమారి, బాబు, సతీష్ ఇశ్రా వత్‌లు పాల్గొన్నారు.

'అభివృద్ధి గురించి కేటీఆర్ మాట్లాడడం సిగ్గుచేటు'

సిరిసిల్ల టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి గురించి కేటీఆర్ మాట్లాడడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. శనివారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ప్రకాష్ మాట్లాడారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సిరిసిల్ల, వేములవాడ అభివృద్ధి గురించి మాట్లాడడం శోచనీయ మన్నారు. అభివృద్ధి అనేది నిరంతరం జరిగే ప్రక్రియ, ఏపార్టీ అధికారంలో ఉన్న ప్రతి గ్రామానికి, పట్టణానికి రావల్సిన వాటా రావల్సిందే అన్నారు. మున్సిపల్ అభివృద్ధికి ఇచ్చిన రూ.40 కోట్లు నిధులు రాకుండా కాంగ్రెస్ అడ్డుకున్నారని కేటీఆర్ మాట్లాడడం సబబుకాదన్నారు. దానికి సంబంధించిన టెండర్లను పిలవడం జరిగిందని మధ్యలో ఎన్నికల కోడ్ రావడంతో గతంలో మొదలుపెట్టిన పనులను కొనసాగించాలని మొదలుపెట్టని పనులను నిలిపివేయాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆదేశాలతో నిలిచిపోయాయన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎండీ ఖాజా, దుబాల వెంకటేశం, నర్సయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి చందన, మాజీ పీసీసీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, కత్తెర దేవదాస్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ ఛైర్మన్ నీలి రవీందర్, నాయకులు గుండ్లపెల్లి గౌతమ్, కొట్టెపెల్లి సుధాకర్, బొద్దుల శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత రక్త పరీక్ష శిబిరం

సిరిసిల్ల టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : కనెక్ట్ డయాగ్నొస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం సిరిసిల్ల పట్టణం 17వ వార్డులో ఉచిత రక్త పరీక్ష శిబిరం నిర్వహించారు. స్థానిక గాంధీనగర్ హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఉచిత రక్త పరీక్ష శిబిరంను వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజపూర్ణచందర్ ప్రారంభించారు. మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్, నాయకులు కుడిక్యాల శంకర్, స్వర్గం ప్రసాద్, కనెక్ట్ డయాగ్నొస్టిక్ సెంటర్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.